

మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించాలి
మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించి నియామకాలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర నేత ఎస్ ఎస్ నాయుడు కోరారు. - 8లో



గ్రామీణ వైవిధ్య కథలు 'మడకెద్దులు'
'మడకెద్దులు' కథల సంపుటిలో గ్రామీణ సమాజాన్ని రచయిత ఆవిష్కరించారని సాహితీవేత్తలు కొనియాడారు. - 8లో



ముగ్గురు ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్
అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు మీ కోసం..


ధ్యాన్‌చంద్ర, ఇన్‌చార్జి కలెక్టర్

తిరుపతి అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన పేరుతో జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలను చూపుతూ వచ్చింది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో స్పందన స్థానంలో 'మీ కోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) పేరుతో కలెక్టరేట్‌లో సోమవారం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరోవైపు డివిజన్, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోనూ అర్జీలను స్వీకరించి వాటికి పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. భక్తుల క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 74,467 మంది స్వామివారిని దర్శించుకోగా, 40,005 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఐటీ అంశాలపై ఎంఓయూ


ఒప్పందపు పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీల రిజిస్ట్రార్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, వైఎస్సార్ కడప యోగివేమన వర్సిటీల మధ్య పలు అంశాలపై అవగాహనా ఒప్పందం జరిగింది. మహిళా వర్సిటీలో వీసీ డి.భారతి సమక్షంలో ఆదివారం ఇరు వర్సిటీల రిజిస్ట్రార్‌లు ప్రొఫెసర్ రజిని, ప్రొఫెసర్ వైపీ వెంకట సుబ్బయ్య ఒప్పందపు పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ ద్వారా ఇరు వర్సిటీల మధ్య ఐటీ సహాయ సహకారాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ


ఆలయంలో భక్తుల కిటకిట

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వారితో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 30 వేలమంది దర్శించుకున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 2,550మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 3,663మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు పూజలు 2,789మంది, రూ.750 పూజలు 1,305మంది, రూ.1,500 పూజలు 363మంది, రూ.2,500 పూజలు 327మంది, రూ.5వేలు పూజలు 83మంది చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి రూ.21,924 అమ్ముడైనట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఎస్‌ఓఎస్ సేవలు ఎనలేనివి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ శాంతన భట్టాచార్య

ఏర్పేడు: తల్లిదండ్రులు సంరక్షణ లేని పిల్లలకు ఎస్‌ఓఎస్ బాలల గ్రామం అందిస్తున్న సేవలు ఎనలేనివని ఐసర్ డైరెక్టర్ శాంతన భట్టాచార్య అన్నారు. ఆదివారం నాగంపల్లి సమీపంలోని ఎస్‌ఓఎస్‌లో సంస్థ వ్యవస్థాపకుడు దివంగత డాక్టర్ హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా 60వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్ మాట్లాడుతూ ఓస్‌ఓఎస్ బాలల గ్రామంలో పిల్లల సంరక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. ప్రొఫెసర్లు ఆర్‌వీ కుమార్, వసంత్, సీఈఓ సుమంత్ పాల్గొన్నారు.

చెరువు మట్టి.. చెరబట్టి


పెళ్లకూరు మండలం యర్రగుంట చెరువులో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు



జిల్లాలో ఒకవైపు చెరువులు, కొండల మట్టి లూటీ.. మరో వైపు చెరువులు, కాలువల కబ్జాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగిస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చింది..మా ఎమ్మెల్యే చెప్పాడు.. మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం అంటూ తెగేసి చెబుతున్నారు. పెళ్లకూరు మండలంలో గోరంత అనుమతులు అడ్డం పెట్టుకుని చెరువులు, కొండలు, వాగులు, ప్రభుత్వ భూముల్లో యంత్రాలతో టీడీపీ నేతలు యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెబుతూ చెరువులు, కాలువలను అడ్డూ అదుపు లేకుండా ఆక్రమించుకుంటున్నారు. ప్రశ్నించే వారిపై తిరగబడుతూ మీపై కేసులు పెట్టిస్తాం అంటూ రెచ్చిపోతున్నారు. కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన గ్రామ సహాయకుడిపైనే దాడి చేసేందుకు తెగబడ్డారు.

మొదలైన అధిక్కారం
- అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత
- చెరువులు..కొండలు కొల్లగొడుతున్న పెళ్లకూరు టీడీపీ నేతలు
- చంద్రగిరిలో చెరబడుతున్నారు..!
- ఎమ్మెల్యే నాని పేరుతో కబ్జాల పర్వం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పెళ్లకూరు మండలానికి చెందిన కొందరు సీనియర్ టీడీపీ నేతలు నందిమాల, యర్రగుంట, శిరసనంబేడు, రోసనూరు, రాజుపాళెం, అర్థమాల తదితర గ్రామాల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. ప్రయివేట్ కంపెనీలకు గ్రావెల్‌ను విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. ఇక్కడి అధికారులు తమకేమీ పట్టదన్నట్టు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని శిరసనంబేడు గ్రామంలో సిద్ధేశ్వరస్వామి కొండ సమీపంలోని అసైన్‌మెంట్ భూములు, యర్రగుంట చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. నాయుడుపేట పరిసరాల్లో వేస్తున్న లేఅవుట్లు, మేనకూరు సెజ్‌లో పరిశ్రమలు, 71వ జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి పనులకు గ్రావెల్, మట్టి అవసరం ఏర్పడింది. దాంతో గ్రావెల్, మట్టికి గిరాకీ ఉంది. ఈ క్రమంలో టీడీపీ నాయకులు మైనింగ్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇస్తూ నిత్యం యంత్రాలతో తవ్వకాలు చేపట్టి లారీలతో యథేచ్ఛగా తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టడంతో ప్రమాదకర స్థాయిలో గోతులు ఏర్పడుతున్నాయి. అలాగే లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు రేయింబవళ్లు గ్రావెల్‌ను తరలిస్తుండడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు టీడీపీ నేతలు అందించే మామూళ్లకు అలవాటుపడి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

శిరసనంబేడు, రోసనూరు, అర్థమాల, నందిమాల, యర్రగుంట గ్రామ పరిసరాల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టకూడదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇక్కడి టీడీపీ నేతలు వాటిని బేఖాతర్ చేస్తూ గ్రావెల్ తవ్వకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ధనార్జనే లక్ష్యంగా అక్రమ వ్యాపారాలను మొదలు పెట్టడంపై స్థానికులు నిరసన పర్వానికి సిద్ధమయ్యారు.

అనుమతులున్నాయంటూ..

టీడీపీ నాయకులు ఐదు వేల క్యూబిక్ మీటర్ల వరకు గ్రావెల్ తవ్వకాలకు మాత్రమే మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి 50 వేల క్యూబిక్ మీటర్లకు పైగా తవ్వకాలు చేపడుతున్నారు. దీనిపై స్థానికులు ప్రశ్నిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. చెరువుల్లో పది అడుగులకంటే ఎక్కువ లోతు గుంతలు తవ్వేశారు. తద్వారా వర్షాకాలంలో మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని, పిల్లలు కూడా ఈతకు వెళ్లి అందులో మునిగిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్ ఉన్నతాధికారులు స్పందించి అసైన్‌మెంట్ భూములు, చెరువులు, గుంతలు, కొండ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు.


పెళ్లకూరులో మట్టి తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

మా ప్రభుత్వం వచ్చింది.. మా నాని చెప్పాడు

తిరుపతి రూరల్ మండలం పేరూరు సర్వే నంబర్ 546లో 184.5 ఎకరాల్లో ఆ చెరువు విస్తరించి ఉంది. తిరుపతి–చిత్తూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ విలువైన చెరువుపై తాజాగా అధికారపార్టీ ఎమ్మెల్యే నాని అనుచరుల కన్ను పడింది. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాయం కనుసన్నల్లో ఈ చెరువు ఆక్రమణలకు నాలుగు రోజులుగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. పేరూరు ధర్మరాజుల గుడి వెనుక చెక్ డ్యామ్‌కు ఆనుకుని దాదాపు రూ.2 కోట్ల విలువైన 250 అంకణాల చెరువును ఆక్రమించేందుకు జేసీబీలతో చదును చేశారు. పెద్ద పెద్ద చెట్లను సైతం కూల్చివేసి చెరువు కట్టను ధ్వంసం చేశారు. చెరువును ఆక్రమించడమే కాకుండా కట్టను ధ్వంసం చేస్తున్న ఎమ్మెల్యే నాని అనుచరులను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించారు. 'మా ప్రభుత్వం వచ్చింది. మా ఎమ్మెల్యే నాని చెప్పాడు...మా ఇష్టం వచ్చినట్టు చేస్తాం...చెరువును ఆక్రమిస్తే మీకు ఏమిటి నష్టం... అడ్డుకుంటే కేసులు పెడతాం...' అంటూ టీడీపీ నేతలు బెదిరిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

కాలువ కట్ట మాయం

పేరూరు పంచాయతీలోనే జాతీయ రహదారికి సమీపంలోని సర్వే నంబర్ 80లో కాలువ పోరంబోకు ఉంది. రామానుజపల్లి చెరువు నుంచి తుమ్మలగుంట చెరువుకు వచ్చే ప్రధాన కాలువ ఇది. దీన్ని పేరూరుకు చెందిన చోటా నేతలు ఆక్రమించేందుకు చదును చేశారు. దాదాపు రెండు కోట్ల విలువైన 300 అంకణాలను ఆక్రమించారు. ఉపాధి నిధులతో చేసిన పనులను సైతం ధ్వంసం చేశారు. కాలువ కట్ట రూపురేఖలు మాయం చేశారు. ఇక్కడా అంతే... ఎమ్మెల్యే నాని చెప్పాడు... మా ప్రభుత్వం వచ్చింది.. మేము ఆక్రమిస్తాం.. అడ్డుకుంటే మా ప్రతాపం చూపుతాం ... అంటూ బెదిరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పేరూరు చెరువు, కాలువ స్థలాల్లో జరుగుతున్న ఆక్రమణలను పరిశీలించామని, వాటిని ఆపినట్లు స్థానిక వీఆర్వో అనిల్ తెలిపారు.


పైడిపల్లె పంచాయతీలో మట్టి తెచ్చి కాలువను పూడ్చి వేస్తున్న టిప్పర్

కాలువ కబ్జా

తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె పంచాయతీలో రూ.3 కోట్ల విలువైన దాదాపు 50 సెంట్ల కాలువను టీడీపీకి చెందిన పిల్లపాళెం పరంధామరెడ్డి కబ్జా చేస్తున్నాడు. గతంలో కాలువ కబ్జాను కాపాడాలని తిరుపతి రూరల్ తహసీల్దార్, రెవెన్యూ అధికారులపై వాగ్వాదం చేసి, కోర్టులో కేసులు వేసింది ఆయనే. ఇప్పటికీ కోర్టులో తహసీల్దార్‌పై కేసు నడుస్తోంది. కాలువను కాపాడుతున్న వ్యక్తి అని గ్రామస్తులు కీర్తించిన ఈ పరంధామరెడ్డి రాష్ట్రంలో అధికారం మారగానే కబ్జారాయుడిగా మారాడు. సర్వే నెంబర్ 187లోని కాలువగా ఉన్న దాదాపు 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడు. పట్టపగలే భారీ టిప్పర్లతో మట్టిని తెచ్చి కాలువను పూడ్చివేస్తున్నాడు. గ్రామస్తులు, మీడియా ప్రతినిధులు సైతం ప్రశ్నిస్తే..ఎమ్మెల్యే నానికి చెప్పాం...ఆయన ఆక్రమించుకోమన్నాడు...గతంలో కోర్టులో కేసులు వేసింది వాస్తవమే...ఇప్పటికీ కేసు ఉంది. అయితే ఏంటీ..మా ఎమ్మెల్యేకి చెప్పే చేసుకుంటున్నాం... అంటూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతున్నాడు. కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన గ్రామ రెవెన్యూ సహాయకుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. స్థానికులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుతికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై దీని వెనుక ఎమ్మెల్యే నాని హస్తం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో చెరువులు, కాలువలను ఎమ్మెల్యే నాని పేరు చెప్పి ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, నీటి వనరులను కాపాడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.


పేరూరులో ఆక్రమించేందుకు అక్రమార్కులు చదును చేసిన కాలువ కట్ట


తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో టీడీపీ నేతలు చెరువు కట్టను ధ్వంసం చేసి ఆక్రమించేందుకు చదును చేసిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం

"యర్రగుంట, నందిమాల చెరువులు, రోసనూరు, అర్థమాల అటవీ భూములు, పలు ప్రాంతాల్లోని అసైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌రావు, తహసీల్దార్, పెళ్లకూరు

పెద్దఎత్తున బది'లీల' జీఓ

- ఎన్జీ రంగా విశ్వ విద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా..
- ఒక సామాజిక వర్గాన్నే టార్గెట్ చేస్తూ బదిలీ జీఓ

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం(ఆంగ్రో)లో భారీ ఎత్తున అధ్యాపకులు, శాస్త్రవేత్తలను బదిలీ చేస్తూ ఆగమేగాలపై జీవో విడుదల అయ్యింది. ఉన్నఫలంగా సుమారు 60 మందికి పైగా ఏకకాలంలో బదిలీ చేయడం ఆంగ్రో చరిత్రలో ఇదే మొదటి సారి అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిడితో సర్వీస్ రూల్స్‌ను సైతం బేఖాతర్ చేసి బదిలీల ప్రక్రియ కొనసాగిందని అధ్యాపకులు వాపోతున్నారు. ఇందులో ప్రధానంగా మహిళా అధ్యాపకులను, సైంటిస్టులను ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. గతంలో తమను బదిలీ చేయాలంటూ పలువురు వర్సిటీ అధికారులను బతిమలాడిన పట్టించుకున్న పాపనపోలేదు. ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేకుండా మహిళల పరిస్థితులను పరిగణలోని తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంత భారీ ఎత్తున బదిలీలు చేయడం విస్మయానికి గురి చేస్తోందని అధ్యాపకులు వాపోతున్నారు.

ఆ సామాజిక వర్గాన్నే టార్గెట్ చేస్తూ..

తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సుమారు 12మంది నుంచి 15మంది అధ్యాపకులు, శాస్త్రవేత్తలను బదిలీ చేశారు. ఇందులో 10మందికి పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడం విశేషం. సుమారు 300 నుంచి 500 కిలో మీటర్ల దూరం పైగా ఉన్న పరిశోధనా కేంద్రాలకు, వ్యవసాయ కళాశాలలకు వారిని బదిలీ చేస్తూ జీవో విడుదల చేశారు. వెంటనే వారిని విధుల నుంచి రిలీవ్ చేసి బదిలీ చేసిన స్థానాలకు పంపాలని హుకుం జారీ చేశారు. రాజకీయ ఒత్తిడి కారణంగానే ఇంత పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టారని, గతంలో ఎప్పుడూ నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి బదిలీలు జరిగిన దాఖలాలు లేవని కళాశాలలో చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో రాజకీయ నాయకుల జోక్యం మితిమీరితే ఇలాంటి పరిణామలే జరుగుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి కనీసం 10రోజుల కాకుండానే ఇంత పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయంటే కక్ష సాధింపులో భాగమేనంటూ అధ్యాపకులు వాపోతున్నారు.


తిరుపతి ఎస్వీ అగ్రి కల్చరల్ కళాశాల

పారదర్శకంగా గురుకుల సీట్ల భర్తీ

- 6,7,8,9 తరగతుల్లో 50 సీట్లు ఖాళీ
- భర్తీకి ఈనెల 27న పరీక్ష


జయభారతి

తిరుపతి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీ సీట్లను పారదర్శకంగా భర్తీ చేస్తామని జిల్లా కోఆర్డినేటర్ వి.జయభారతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మెరిట్ ఆధారంగా మాత్రమే సీట్లు భర్తీ చేస్తామని, ఎలాంటి సిఫార్సులను అంగీకరించమని వెల్లడించారు. జిల్లాలో శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు ,కోట, వాకాడు, చిల్లకూరు, నాయుడుపేట, పుదూరు, సూళ్లూరుపేట, డక్కిలి మొత్తం పది చోట్ల మాత్రమే గురుకుల పాఠశాలలతోపాటు కళాశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పది గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రిజర్వేషన్ మేరకు పోటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు పరీక్ష ఉంటుందని చెప్పారు. జిల్లాలో పుత్తూరు, వాకాడు కళాశాలల్లో మాత్రమే ఆర్ట్స్ గ్రూపులు ఉన్నాయని, మిగిలిన 8 చోట్ల కేవలం సైన్స్ గ్రూపులు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్‌కు సంబంధించి వాకాడులో ఇప్పటికే ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు అక్కడి ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని చెప్పారు. మిగిలిన ఖాళీలను తెలియజేస్తామని వెల్లడించారు.

పోలింగ్ అనంతరం పోలీసుల సేవలు భేష్


మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- ప్రతిభ చూపిన పోలీసులకు ప్రశంసాపత్రాలు

చంద్రగిరి: అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన చంద్రగిరిలో పోలింగ్ అనంతరం జరిగిన ఘటనలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో, శాంతి భద్రతలను అదుపులోకి తీసుకు రావడంలో పోలీసుల కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రశంసించారు. ఆదివారం చేసిన నియోజకవర్గ పోలీసు అధికారులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరిగినా అనంతరం చంద్రగిరి నియోజకవర్గంలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరగడంతో శాంతి భద్రతల పరిరక్షణ పెను సవాలుగా మారిందని తెలిపారు. అయినా చంద్రగిరి సబ్ డివిజన్ పోలీసులు ఆత్మస్థైర్యంతో ముందుకు నిలబడి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని కౌంటింగ్ రోజున, కౌంటింగ్ అనంతరం ఎలాంటి ఘటనలు జరగకుండా శ్రమించి పని పనిచేశారన్నారు. పోలీసులందరూ ఆత్మ విమర్శ చేసుకుని, స్వీయ క్రమశిక్షణ కలిగి రానున్న రోజుల్లో చట్టానికి లోబడి పనిచేసి, చంద్రగిరి సబ్ డివిజన్‌పై ఉన్న మరకను పూర్తిగా చెరిపి వేయాలని సూచించారు. కష్టపడి పని చేసే సిబ్బందికి తప్పనిసరిగా గుర్తింపు అవసరం, అలాంటి వారికి ప్రోత్సాహకంగా రివార్డుల నిమిత్తం పేర్లు పంపాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. హోంగార్డు నుంచి అధికారులు వరకు అందరూ సమానమే, ఎవరు చిత్తశుద్ధితో బాగా పని చేస్తారో వారిని బాగా గౌరవిస్తానన్నారు. జిల్లాలోని పోలీసులందరికీ కూడా గుడ్ సర్వీస్ ఎంట్రీ అనే రివార్డును ఎస్పీ ఇచ్చారు. అలాగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలతో కలిసి పోలీస్ సిబ్బందికి స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటాద్రి, నరసింగప్ప, రవీంద్రారెడ్డి, చంద్రగిరి సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

క్లుప్తంగా

ముగ్గురు ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో స్మగ్లర్లను విచారించి, కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ సురేష్ బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టినట్లు తెలిపారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారని, వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. వారిలో ముగ్గురిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారంతా తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్ (37), మోహనవేల్ (25), శక్తివేల్ (27)గా గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి, ఆదివారం తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

పాత కక్షలతో మోటారు సైకిల్ ధ్వంసం

బాలాయపల్లి(సైదాపురం): పాత కక్షలతో మోటారు సైకిల్‌ను ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని కడకుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు మల్లెపు బాబు కథనం మేరకు.. ఉదయం 11 గంటలకు తన వ్యవసాయ పొలం సమీపంలో మోటరు సైకిల్ పెట్టి పనులు పూర్తి చేసుకోని, ఒంటి గంటకు వచ్చి చూడగా మోటార్ సైకిల్ డూమ్ ధ్వంసమై ఉంది. పాత కక్షను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన అచ్చి ధనంజయ్య డూమ్ పగులకొట్టినట్లు బాధితుడు బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్టీసీలో ఖాళీ బస్సుల వేట

జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో ఖాళీ బస్సుల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు. ఏ డిపోలో ఎన్ని సర్వీసులు ఖాళీగా ఉన్నాయో తెలియజేయాలని ఇప్పటికే జిల్లా కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చారు. మహిళా ఉచిత బస్సు స్కీమ్ అమలు చేసేందుకు ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు కసరత్తు మొదలైంది. ఏ డిపోలో ఎన్ని సర్వీసులు ఖాళీగా ఉన్నాయి.. ప్రత్యేకించి ఉచిత బస్సులకు వాడుకునేందుకు ఏడిపో నుంచి ఎన్ని సర్వీసులను ఇవ్వగలరు..చిన్న చిన్న మరమ్మతులతో వాడుకలో లేని సర్వీసులు ఎన్ని ఉన్నాయి.. తదితర అంశాలపై జిల్లా ఆర్టీసీ పెద్దల్లో ఉచిత మహిళా బస్సుల గుబులు మొదలైంది.

- ఏ డిపోలో ఎన్ని సర్వీసులు వినియోగంలో లేవు
- మహిళలకు ఉచిత బస్సు స్కీమ్‌పై కసరత్తు
- ఆలయ ప్రాంతాలకు అధికంగా నడపాలని యోచన
- రాబడికి గండి పడకుండా చర్యలకు కసరత్తు



తిరుపతి ఆర్టీసీ బస్టాండ్

తిరుపతి అర్బన్: మహిళలకు ఆర్టీసీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం హామీపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రానున్న నేపథ్యంలో అధికారులు కసరత్తు ప్రారంభించారు. డిపోల వారీగా బస్సుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రం నేపథ్యంలో ప్రధానంగా తిరుమల కొండకు నిత్యం భక్తుల రద్దీ నేపథ్యంలో అధిక రాబడి సాధించడంలో జిల్లా రాష్ట్రంలో ఏటా ప్రథమ స్థానంలో నిలుస్తోంది. జిల్లాలో 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. 743 సర్వీసులు నడుస్తున్నాయి. ప్రత్యేకంగా తిరుమలతోపాటు రేణిగుంట ఎయిర్‌పోర్ట్, నెల్లూరు, మదనపల్లె, కడపకు వంద విద్యుత్ బస్సులను నడుపుతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని ఇచ్చిన హామీ సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలోను ఇదే హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంతో అత్యధికంగా మహిళలు ఆలయాలు ఉండే ప్రాంతాలకే ఎక్కువగా ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ పెద్దల వద్ద లెక్కలున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుచానూరు, సూళ్లూరుపేట చెంగాళమ్మ, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం తదితర ప్రాంతాల్లో ఉచిత మహిళా బస్సులను అధికంగా ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యోచన చేస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిబంధనలు అందిన వెంటనే కార్యాచరణ మొదలు పెట్టాలని భావిస్తున్నారు. ఇప్పటి నుంచే ఏఏ మార్గంలో ఎన్ని సర్వీసులు ఏర్పాటు చేయాలనే అంశాలపై జోరుగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఏ డిపోల్లో ఎన్ని సర్వీసులు ఖాళీగా ఉన్నాయి, ప్రత్యేకించి ఉచిత బస్సులకు వాడుకోవడానికి ఏ డిపో నుంచి ఎన్ని సర్వీసులను ఇవ్వగలరు, చిన్న చిన్న మరమ్మతులతో వాడుకలో లేని సర్వీసులు ఎన్ని ఉన్నాయి, వాటిని మర్మమత్తులు చేయడానికి వీలుంటుందా తదితర అంశాలపై జిల్లా ఆర్టీసీ పెద్దలు జోరుగా కసరత్తు మొదలుపెట్టారు. అయితే రాబడి తక్కువగా ఉన్న పల్లె వెలుగు సర్వీసులను తొలగించి ఉచిత మహిళా సర్వీసులను వినియోగిస్తే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని లెక్కలు వేస్తున్నారు. మరోవైపు రద్దీగా ఉండే ప్రాంతాల్లో సర్వీసులు తగ్గిస్తే రాబడి తగ్గే ప్రమాదం భావిస్తున్నారు. అంతేకాకుండా ప్రయాణికులకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఆర్టీసీలో ఉచిత మహిళా బస్సుల గుబులు మొదలైంది.

జిల్లాలో డిపోల వారీగా బస్సుల సంఖ్య

తిరుపతి	–	108
అలిపిరి	–	60
తిరుమల	–	109
మంగళం	–	89
శ్రీకాళహస్తి	–	88
పుత్తూరు	–	75
సత్యవేడు	–	51
గూడూరు	–	44
సూళ్లూరుపేట	–	36
వెంకటగిరి	–	40
వాకాడు	–	43

జిల్లా ఆర్టీసీ సమాచారం

జిల్లాలో ఆర్టీసీ డిపోలు	11
ఆర్టీసీ సర్వీసులు	743
విద్యుత్ సర్వీసులు	100
ఉద్యోగులు	4255 మంది
రోజు వారి ప్రయాణికులు	5.75లక్షలు
రోజు వారి ఆదాయం	1.60 కోట్ల నుంచి 1.70 కోట్లు

సచివాలయంపై టీడీపీ మూకల దాడి



సచివాలయ భవనంపై శిలాఫలాకాలు ధ్వంసం చేస్తున్న టీడీపీ మూకలు, శిలా ఫలకం లేని గోడ

- శిలా ఫలకాలు ధ్వంసం
- పోలీసులకు భూ దాత ఫిర్యాదు

శ్రీకాళహస్తి రూరల్ : సచివాలయంపై టీడీపీ మూకలు దాడి చేసి శిలాఫలకాలు ధ్వంసం చేశారు. శ్రీకాళహస్తి మండలం పోలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ముప్పాల జనార్దన్ నాయుడు, పులిచింత గుణయ్య, పులి నాగరాజు, పోలి చిరంజీవి, వీ.హరీష్, పి.పోలయ్య, పి.ప్రదీప్ అనుచరులతో కలసి ఆదివారం గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. సచివాలయ భవన శిలాఫలకాలు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో కూడిన హోర్డింగులు, సచివాలయ పేరు ఫలకాలను గడ్డపారలు, ఇనుప కమ్మీలతో ధ్వంసం చేశారు. గ్రామంలో సచివాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి, పోలి గుణ తమ సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చి గుత్తేదారులుగా సచివాలయ నిర్మాణం చేపట్టారు. సచివాలయం నిర్మాణం పూర్తయినా, ఇంతవరకు తమకు రావాల్సిన బిల్లుల బకాయిలు కూడా ఇంకా ఇవ్వలేదని వారు వాపోయారు. ప్రస్తుతం సచివాలయ నిర్మాణం చేపట్టిన స్థలం తమపైనే ఉందని, ప్రభుత్వానికి ఇప్పటివరకు స్వాధీనం చేయలేదన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటుందని సచివాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చేందుకు సమ్మతించామని తెలిపారు.

పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిన అవసరం ఉన్నా టీడీపీ నాయకులు ఓర్వలేక అధికారంలోకి రాగానే సచివాలయం భవనంపై దాడి చేయడం, శిలాఫలకాలను ధ్వంసం చేయడం దారుణమన్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించాలి

- జీఓ 117ను రద్దు చేయాలి
- యూటీఎఫ్ రాష్ట్ర నేత ఎస్ఎస్‌నాయుడు డిమాండ్

తిరుపతి ఎడ్యుకేషన్ ఎన్నికల హామీల్లో భాగంగా మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని, అంతవరకు అవసరమైన చోట విద్యా వలంటీర్లను నియమించి బోధన చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం జిల్లా సహాధ్యక్షుడు కేఎస్‌బీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీఓ 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని కోరారు. ప్రాథమిక విద్యావ్యవస్థలో పెద్ద మొత్తంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేసి కొత్త పీఆర్సీని ప్రకటించాలని, ఆలోపు 33 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు కె.శేఖర్ మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లో అవసరమైన పోస్టులను మంజూరు చేసి అర్హత గల వారికి పదోన్నతి కల్పించాలని, అలాగే ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న నెలసరి పదోన్నతులు సైతం ఇవ్వాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, పద్మజ, సురేష్, మోహన్‌బాబు, వెంకటకృష్ణ, విజయకుమార్, సుధీర్, హరిబాబు, గీతమ్మ, శేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు విజయశ్రీ, సునీల, సదాశివరెడ్డి, వాసుదేవరావు, రామమూర్తిరాజు పాల్గొన్నారు.

గ్రామీణ వైవిధ్య కథలు 'మడకెద్దులు'



మడకెద్దులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, పలువురు సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్: 'మడకెద్దులు' కథల సంపుటిలో రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం గ్రామీణ సమాజాన్ని ఆవిష్కరించారని రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్ కొనియాడారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన మడకెద్దులు కథల పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఎస్వీయూ గ్రంథాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించియ మాట్లాడుతూ సంపుటిలోని కథలు సామాజిక స్పృహతో వాస్తవ సంఘటలను ఆధారంగా రాసినవని, ఎంతో మదనపడితే తప్ప ఇలాంటి రచన సాగదని తెలిపారు. మరో అతిథి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ వస్తువు కోసం వెతుకులాట కాకుండా తన లోకానుభవాలను, యథార్థ సంఘటలను రచయిత కథల్లో చిత్రించారని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన మరో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత జిల్లేళ్ల బాలాజీ మాట్లాడుతూ సంపుటిలో తల్లి పడే ప్రసవ వేదన, శిశిర స్వప్నంలో బిడ్డల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేశారని తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి మాట్లాడుతూ నాగలి ప్రాధాన్యత, రైతులు స్థితిగతులను సంపుటిగా తేవడం రైతు బిడ్డగా అభినందనీయమన్నారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపకుడు సాకం నాగరాజు మాట్లాడుతూ పేరూరు బాల సుబ్రమణ్యం జీవితమే ఒక పోరాట కథ అంటూ బాల్యదశ నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని మంచి కథా రచయితగా పేరు పొందడం ప్రశంసనీయమన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ రచయిత పేరూరు వ్యక్తిత్వమే తన కథల సారమని కొనియాడారు. రచయితలు విశ్వనాథరెడ్డి, వాకా ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలతో సావాసం చేస్తూ సాటి మనుషుల మధ్య జరిగిన సంఘటనలను కథా వస్తువులుగా అందరికీ అర్థమయ్యే రీతిలో రాయడం అభినందనీయమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమితి సభ్యులు టెంకాలయ దామోదరం, దామోదర గుప్త, పొక్కిళ్ల సుభద్ర, శశిధర్‌రాజు, నాదెండ్ల శ్రీమన్నారాయణ, తెలు గు ఆచార్యులు పీసీ వెంకటేశ్వర్లు, యువశ్రీ, సుహాసిని, కాంతా రావు, కొత్వాలు అమరేంద్ర, షణ్ముగం, గొడుగుచింత గోవింద య్య, జయపాల్, జయరాంప్రసాద్, కేశవులు,రాజు, హరి పాల్గొన్నారు.

టీటీడీ ఎంప్లాయిస్ ఆల్ సంఘ్ నూతన కమిటీ



టీటీడీ ఎంప్లాయిస్ ఆల్ సంఘ్ నూతన కమిటీ సభ్యులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల సంక్షేమం కోసం బీఎంఎస్ అనుబంధంగా టీటీడీ ఎంప్లాయిస్ సంఘ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్లో జరిగిన సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కోదండరామ్ సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ శ్రీవారి సేవలో ఉద్యోగం చేయడం ఎంతో అదృష్టమని తెలిపారు. 1955లో ఆర్ఎస్ఎస్ ఉద్యోగ కార్మికుల సంక్షేమం కోసం బీఎంఎస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బీఎంఎస్ దేశవ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సాగించి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. సంఘ్ అధ్యక్షుడిగా డాక్టర్ నొస్సం నరసింహ ఆచార్య, ప్రధాన కార్యదర్శిగా కంటేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఆర్ఎం చంద్ర, ఉపాధ్యక్షుడిగా గంగాధరరావు, కార్యదర్శులుగా లోకచంద్ర, మునిరాజుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. టీటీడీ ఏఈవో రామకృష్ణ, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప, ఆర్.ఎస్.ఎస్. నేతలు నందనవనం శ్రీనివాస్, డాక్టర్ దత్తాత్రేయ రావు, టీటీడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మీ ఎంపికకు సులువైన మార్గం
సాక్షి
APPOINTMENTS
ఉద్యోగావకాశములు
తక్కువ ధరకే ప్రకటన సౌలభ్యం
ప్రతి మంగళ, శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి.
99122 20586
99516 02971
Mail id tptadvtsakshi@gmail.com
SAKSHI

సాక్షి క్లాసిఫైడ్స్

Education
DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate
PLOTS FOR SALE
తిరుపతి చుట్టు ప్రక్కన అప్రూవల్ ప్లాట్స్ 6.50 లక్షలు, 8 లక్షలు, 10 లక్షలు, 12, 15, 20 లక్షలు, 30 లక్షలు. Investment & గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్స్ అమ్మబడును. ✆ 9966066111.

BUSINESS SERVICE

BUSINESS OFFER
ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్ పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్&DMA కావలెను. జీతం+కమీషన్. సంప్ర: 8295642391

GOLD FINANCE
బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర:: ✆ 99516 88858

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

Wanted
తిరుపతి, రేణిగుంట, పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ మరియు ఫీల్డ్ ఆఫీసర్ కావలెను. ✆ 8019956289.
తిరుపతిటౌన్ పరిధిలో ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీ తరఫున పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (జీ: 12,000),సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవం కలిగిన ఫీల్డ్ ఆఫీసర్స్ (జీ.20,000) కావలెను. 7680848899.
Wanted Teachers for U.KG 1st to 5th Classes and English, Social Teacher for Higher Class, Mangalam Tirupati, 93980 81895.
తిరుపతిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పనిచేయుటకు సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్ కావలెను. సంప్రదించండి: 9741163131.
ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15-25 వేలు, మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 78834 59404.
ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం



జ్యోతి, పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ గౌస్ పీర్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో ఈనెల 20న ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన వివాహిత జ్యోతి కేసును పోలీసులు 24 గంటల్లో చేధించారు. భర్తతో ఏర్పడిన వివాదాలతో ఆమె ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ విషయమై జ్యోతి కుటుంబ సభ్యులు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఎస్ఐ గౌస్ పీర్, సిబ్బంది దర్యాప్తు ప్రారంభించారు. శనివారం రాత్రి 10గంటల సమయంలో నెల్లూరు జిల్లా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి, ఆమె కుమారుడు సుకుమార్ (7), కుమార్తె నిఖిల (6) ఉన్నట్లు గుర్తించారు. అక్కడ నుంచి వారిని శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫిర్యాదు చేసిన జ్యోతి రక్తసంబంధీకులైన అన్న సుబ్రమణ్యంకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

చంద్రగిరి: మండల పరిధిలోని కందులవారిపల్లె సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 25 సంవత్సరాల వయసున్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై ధనమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు 94407 96760 నంబర్‌ను సంప్రదించవచ్చని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

తిరుపతి క్రైమ్: నగరంలోని వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ జయ నాయక్ తెలిపారు. వివరాలు.. పుంగనూరుకు చెందిన బొక్క చంద్రశేఖర్ నాయక్, మదనపల్లె చెందిన పటాన్ జైభూసానిషా నగరంలోని కొత్త మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న అచ్యుత దేవరాయ మార్గంలో గంజాయితో వెళ్తున్నట్లు సమాచారం వచ్చింది. సీఐ సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5,600 విలువ చేసే కేజీ 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై ఇద్దరి యువకుల అత్యాచారం

– పోక్సో చట్టం కింద కేసు నమోదు

గూడూరురూరల్: గూడూరు మండలంలోని ఓ గ్రామంలో ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. గూడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన నరేష్, గణేష్ అనే యువకులు ఈవ్‌టీజింగ్ చేస్తూ బెదిరించేవారు. ఈ క్రమంలో ఆదివారం బాలిక తన ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా.. విషయం తెలుసుకున్న యువకులు ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తర్వాత బాధిత బాలిక కుటుంబ సభ్యులు గూడూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టి.. ఇద్దరి యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఆపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

భర్తపై సలసలా కాగే నూనె పోసిన భార్య

సూళ్లూరుపేట రూరల్: తాగొచ్చి గొడవ చేస్తున్న భర్తపై భార్య రగిలిపోయింది. వడల కోసం కాగబెట్టిన సలసలా కాగే నూనెను తీసుకుని ముఖంపై పోసింది. దీంతో తీవ్ర గాయాలైన భర్త ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం సూళ్లూరుపేట మండలంలో సంచలనం రేపింది. ఎస్ఐ రహీంరెడ్డి కథనం.. సూళ్లూరుపేట మండలం, ఆబాక పంచా యతీ, అమ్మలపాడుకు చెందిన కారిమేటి ఉదయ్‌కుమార్, కారిమేటి మస్తానమ్మ దంపతులు. వీరికి పదేళ్ల కిందట ప్రేమ వివాహమైంది. 9 ఏళ్ల బాలిక, ఏడేళ్ల బాలుడు ఉన్నారు. పిల్లలతోపాటు భార్యాభర్తలిద్దరూ అమ్మలపాడు గ్రామంలోనే నివాసముంటున్నారు. వివాహమైన కొన్నేళ్లకే భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తడంతో ఇద్దరూ తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో ఉదయ్‌కుమార్ ఆదివారం మద్యం సేవించి బిర్యానీ ప్యాకెట్లు ఇంటికి తెచ్చా డు. భర్త మద్యం సేవించడంపై భార్య నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి గొడవపడ్డారు. సహనం కోల్పోయిన భర్త భార్యను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. అడ్డొచ్చిన అత్తను సైతం కర్రతో చావబాదాడు. ఆగ్రహించిన భార్య అదే సమయంలో పొయ్యిపై వడల కోసం సలసలా కాగుతున్న నూనె తీసుకుని భర్తపై పోసింది. భర్త ఉదయ్‌కుమార్ ముఖం, కంటి వద్ద తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఉదయ్‌కుమార్ పరిస్థితి బాగానే ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల : మొదటి ఘాట్ రోడ్డులో మినీవ్యాన్ బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతికి చెందిన ప్రైవేటు మినీ వ్యాన్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనం చేసుకుని తిరుమల నుంచి తిరుపతికి బయలుదేరారు. ఈ వాహనం మొదటిఘాట్ రోడ్డులోని 35వ మలుపువద్దకు చేరుకోగానే అదుపు తప్పి పక్కనే ఉన్న రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు తొలగించి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

మహిళ అదృశ్యం



పోలమ్మ

వెంకటగిరిరూరల్ : వెంకటగిరి రూరల్ మండలం పాపమాంబపురం అగ్రహం వద్ద మహిళ అదృశ్యంపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. గూడూరుకు చెందిన కంట్లం పోలమ్మ(52) ఈనెల 16న పాపమాంబ పురం అగ్రహారంలోని కుమార్తె లక్ష్మి ఇంటికి వచ్చింది. అనంతరం మంగళవారం స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు కోసం పాపమాంపురం రోడ్డు వద్దకు వచ్చింది. అయితే స్వగ్రామానికి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు వెంకటగిరి పోలీసులకు ఆదివారం ఆమె కుమార్తె ఫిర్యాదు చేసింది.